

భద్రత కట్టుదిట్టం చేయాలి

నల్లజర్ల: కోల్‌కతా మహిళా వైద్యురాలి ఘటన తీవ్రంగా కలచివేస్తోంది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యులు, సిబ్బందికి అండగా నిలవడంతోపాటు ఆయా ఆసుపత్రులలో అన్ని వసతులు కల్పించి భరోసా ఇవ్వాలి.

– డాక్టరు మహమ్మద్ సిరాజుద్దీన్, పీహెచ్‌సీ, నల్లజర్ల



వైద్యులకు రక్షణ కల్పించాలి

కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన దాడి సమాజం తల దించుకునేలా ఉంది. ప్రభుత్వాలు ఆసుపత్రుల్లో పని చేస్తున్న వైద్యుల కోసం రక్షణ చర్యలు తీసుకోవాలి. స్వేచ్ఛగా విధులు నిర్వహించడానికి అనుకూలమైన పరిస్థితులు కల్పించాలి. రాత్రి సమయాల్లో పీహెచ్‌సీల్లో స్టాఫ్ నర్సులు విధులు నిర్వహిస్తుంటారు. వారికి భద్రత, భరోసా కల్పించాలి.

– డాక్టర్ హారికా గుప్త, వైద్యురాలు, తాళ్లపూడి పీహెచ్‌సీ



చవితి ఉత్సవాలకు శ్రీకారం

- వచ్చే నెల 7 నుంచి వినాయక చవితి వేడుకలు ప్రారంభం
- వాడవాడలా సన్నాహాలు
- డివిజన్‌లో ఐదు వందలకు పైగా ఉత్సవ శిబిరాలు

కొవ్వూరు: గణపతి నవరాత్ర ఉత్సవాలు వస్తే పల్లెల్లోను, పట్టణాల్లోను సందడి మొదలవుతంది. సెప్టెంబర్ ఏడో తేదీ నుంచి ప్రారంభం కానున్న వినాయకుడి ఉత్సవ పనులు నిర్వాహకులు శ్రీకారం చుట్టారు. డివిజన్‌లో శనివారం చాలా చోట్ల ఉత్సవాలకు ముందు విఘ్నేశ్వరుడికి పూజలు చేసి విఘ్నాలు లేకుండా చూడాలంటూ రాట ముహూర్తాలు చేశారు. ఇప్పటికే నిర్వాహక కమిటీలు భారీ వినాయ విగ్రహాలకు, లైటింగ్, డెకరేషన్ల, సాంస్కృతిక కార్యక్రమాలకు ఆర్డర్లు ఇచ్చారు. అలాగే విగ్రహ నిమజ్జనాల ఊరేగింపులు, తదితర ఏర్పాట్లపై చేస్తున్నారు. చాగల్లులో తెలగా సంఘం, వర్తక సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా వినాయక ఉత్సవాలు నిర్వస్తున్నారు. ఏటా మాదిరిగానే ఈ సారి భారీ ఎత్తున ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. డివిజన్ పరిధిలో చిన్న చిన్న శిబిరాలను కలిపితే సుమారు ఐదు వందలకు పైగా ఉత్సవ శిబిరాలు ఏర్పాటు కానున్నట్లు అంచనా. గత ఏడాది కొవ్వూరు పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చిన్న, చిన్న శిబిరాలతో కలిపి సుమారు 50 విగ్రహాలు నెలకొల్పారు. తాళ్లపూడి 40, కొవ్వూరు మండలంలో 25, చాగల్లు మండలంలో 30 చొప్పున ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కుడా అదే స్థాయిలో ఏర్పాటుకి సన్నాహాలు చేస్తున్నారు. కొవ్వూరు పట్టణంలో మెరక వీధిలో రౌండ్ రామాలయం యూత్ భారీ విగ్రహాన్ని హైదరాబాద్ వంటి నుంచి తీసుకోస్తున్నారు. ప్రధానంగా లాంచీలరేవు, రెల్లిపేట యూత్ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ రోడ్డులోను, సుబ్రహ్మణ్య స్వామి స్నానఘట్టం వద్ద వాడబలిజ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. తాళ్లపూడి మండలం కేంద్రంలోను, చాగల్లు, కొవ్వూరు మండలాల్లో పలు చొట్ల వాడవాడల ఉత్సవాల నిర్వహణకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు.



కొవ్వూరు మెరకవీధిలో వినాయకుడి ఉత్సవాలకు రాట పాతుతున్న నిర్వాహక కమిటీ సభ్యులు



కొవ్వూరు మెరకవీధిలో వినాయకుడి పందిరి వద్ద కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు(ఫైల్)

చాగల్లులో ప్రతిష్ఠాత్మకంగా ఉత్సవాల నిర్వహణ

చాగల్లు మండలం కేంద్రంలో ఈ పరిసర ప్రాంత మండలాలల్లో కెల్లా అత్యంత భారీగా ఉత్సవాలు నిర్వహిస్తారు. వర్తక సంఘం, తెలగ సంఘాల ఆధ్వర్యంలో పోటాపోటీగా ఉత్సవాలు కొనసాగుతాయి. ఏడు దశాబ్దాలుగా ఇక్కడ ఉత్సవాలు ప్రతిష్టత్మకంగా నిర్వహిహిస్తున్నారు. ఇక్కడ సినీ ప్రముఖల కార్యక్రమాల సైతం ఏర్పాటు చేస్తున్నారు. ప్రముఖ సినీ డైరెక్టర్ వీవీ వినాయక్ స్వస్థలం కావడంతో ఎంతో మంది సినీ ఆర్టీస్టులు ఇక్కడికి విచ్చేస్తుంటారు.

పోలీసుల అనుమతులు తప్పనిసరి



వినాయక ఉత్సవ నిర్వాహకులతో ఏరియా వారీగా సమావేశాలు ఏర్పాటు చేస్తాం. పోలీసు మార్గదర్శకాలు, అనుమతులు గురించి వివరిస్తాం. ఉత్సవ శిబిరాలు ఏర్పాటుకి కచ్చితంగా పోలీసుల అనుమతులు తీసుకోవాలి. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కమిటీ సభ్యులపై చర్యలు తీసుకుంటాం. ఉత్సవాలకు సంబంధించి అన్ని వివరాలు రాసి ఇవ్వాలి. ఉదయం ఆరు నుంచి రాత్రి 10 వరకు మాత్రమే మైక్‌లకు అనుమతి ఉంటుంది. నిబంధన అతిక్రమిస్తే నిర్వహణ కమిటీ సభ్యులే బాధ్యత వహించాలి.

– జి.దేవకుమార్, డీఎస్పీ, కొవ్వూరు

అనుమతులు.. పాటించాల్సిన నిబంధనలు..

- ఉత్సవ కమిటీ సభ్యుల వివరాలు పోలీసు స్టేషన్‌లో నమోదు చేయించుకుని పోలీసులకు అండర్‌టేకింగ్ (ఉత్సవాల్లో అన్నింటికి తమదే బాధ్యత అని) లెటర్ ఇవ్వాలి.
- డీఎస్పీ ద్వారా మైక్ అనుమతి, విగ్రహ ఊరేగింపు అనుమతి, పోలీసుల గుర్తింపు సంఖ్య తీసుకోవాలి.
- అనుమతులకు దరఖాస్తుతోపాటు మున్సిపాలిటీ లేదా పంచాయతీ, అగ్నిమాపక, విద్యుత్ శాఖ ఇచ్చిన అనుమతులు జత చేయాలి.
- కమిటీ పర్మిషన్ లెటర్‌లో కమిటీ సభ్యుల పూర్తి వివరాలు, అడ్రస్, ఫోన్ నెంబర్లు, ఉత్సవాల పూర్తి వివరాలు, స్పష్టంగా తెలపాలి.
- బలవంతపు చందాలు వసూళ్లు, దర్శనాల టిక్కెట్లు కేటాయింపు పెట్టకూడదు. ప్రజలను ఏదైనా ఇబ్బందులకు గురిస్తే 100 నెంబర్‌కి గానీ, సంబంధిత పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలి.
- విగ్రహాల ఎత్తు ఐదు అడుగులకు మించకూడదు.
- విగ్రహం ఎత్తు, బరువు, ఉత్సవాలు ఎన్ని రోజులు నిర్వహిస్తారు. నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జనం చేసే ప్రాంతం తెలియజేయాలి.
- విగ్రహ ప్రతిష్ఠ నుంచి ఉత్సవాలు ముగిసేంత వరకు ఉత్సవాల కార్యక్రమాలు, నిమజ్జనం రూట్ మ్యాప్ ముందుగానే తెలియజేయాలి.
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా నిర్వాహకులు ముందస్తు ఏర్పాట్లు జాగ్రత్తలు తీసుకోవాలి.
- సాధారణ ప్రజల రవాణాకి అడ్డంగా, రోడ్లపైన, వివాదస్పదమైన ప్రదేశాల్లోను విగ్రహాలను ఏర్పాటు చేయకూడదు.
- విగ్రహాలు ఏర్పాటు చేసే సమయంలోను, ఊరేగింపు సమయంలోను ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకుంటామని కమిటీ సభ్యులు అండర్ టేకింగ్ లెటర్ ఇవ్వాలి.
- మండపం వద్ద కచ్చితంగా రాత్రి సమయంలో కచ్చితంగా ఒక వ్యక్తి కాపలా ఉండాలి.
- ఉత్సవాల సందర్భంగాను, నిమజ్జనం ఊరేగింపుల్లోను ఏవిధమైన అభ్యంతకర అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పకూడదు.
- నిరంతరం విగ్రహ ప్రతిష్ఠ శిబిరంలో రాత్రి పూట ఇద్దరు, పగటి పూట ఒకరు పర్యవేక్షకులు ఉండాలి.(దీపాలు, విగ్రహాలు, హుండీలు, ఇతర సామాగ్రికి రక్షణగా)
- ప్రతి విగ్రహం వివరాలు పోలీసు పాయింట్ బుక్‌లో ఉంచుతారు.
- శాంతి కమిటీలు ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలి.
- నిమజ్జన సమయంలో ఊరేగింపునకు తప్పనిసరిగా అప్పగించిన పోలీసు సిబ్బంది కుడా ఉండాలి.
- నిమజ్జనం సమయంలో వీడియోగ్రాఫర్‌ని నియమించుకోవాలి.
- శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఏ చేష్టలు చేసినా కమిటీ సభ్యులపైనే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.
- విద్యా సంస్థలు, హాస్పటళ్లు ఉన్న చోట వందమీటర్ల దూరంలో మాత్రమే విగ్రహాలు నెలకొల్పాలి.
- ఉదయం ఆరుగంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే నియమిత పరిమితిలో సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేసుకోవాలి.రాత్రి పది గంటల తర్వాత ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదు.
- ఉత్సవాల నిర్వహణపై పోలీసులు నిర్వహించే సమావేశాలకు తప్పనిసరిగా కమిటీ సభ్యులు హాజరుకావాలి

క్లుప్తంగా

వినాయకుడి వేడుకలకు రాట ముహూర్తం



రాట ముహూర్తం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు సాయిబాబు

కొవ్వూరు: పట్టణం మెరకవీధిలో రౌండ్ రామాలయం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్ర ఉత్సవాలకు శనివారం రాట ముహూర్తం చేశారు. ఉదయం స్వామివారికి పూజలు చేశారు. మురమళ్ల వెంకటేశ్వరరావు, నగ్గల్లపాటి శ్రీనివాస్, కొయ్యల భాస్కర రావు, కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో...

నిడదవోలు : పట్టణంలో గణేష్‌చౌక్ సెంటర్‌లో ఉన్న పూజ గణపతి, కుమారస్వామి వార్ల ఆలయంలో 105 సంవత్సర గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 8.32 గంటలకు వేడుకలకు రాట ముహూర్తం చేశారు. వేదపండితులు ముందుగా స్వామివారికి పూజలు చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ముహూర్తం చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, నిడదవోలు సీఐ వి.శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, పట్టణ జనసేన అధ్యక్షుడు రంగా రమేష్, గాజుల రంగారావు, పువ్వల రతీదేవి, కొత్తపల్లి సుప్రియ, గోపిరెడ్డి శ్రీనివాస్, మద్దుకూరి శ్రీనివాస్, ఆలమూరి రాజ, ఎస్‌కే ఫాషా, ఎండీ ఫయాజ్, సరిదే సత్యం, తోలేటి కోటేశ్వరరావు, లక్కంసాని సూర్యారావు, ముప్పనబోయిన గంగాధర్, దుళ్ల మురళి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



తీపర్రులో భూపతిరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

పెరవలి: తీపర్రులో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుందుల భూపతిరావు తండ్రి కుందుల నాగ భూషణం(85) మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను శనివారం మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయకుడు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోకి ఎప్పుడు వచ్చినా నాగభూషణం ఎంతో ప్రేమాభిమానంతో తండ్రిలా ఆదరించి, భోజనం పెట్టేవారని, అటువంటి వారిని నేడు లేకపోవటం ఎంతో బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

భవిష్యత్తు తరాలకు భరోసా



కళాశాలలో మొక్కను నాటుతున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: పచ్చటి మొక్కలు నాటడమంటే భవిష్యత్ తరాలకు మంచి భరోసా ఇవ్వడమేనని మున్సిపల్ చైర్మన భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సత్య మైక్రో క్యాపిటల్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డి.హరీష్, గ్రంథాలయాధికారి జి.రామ్మోహన్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.యేసురత్నం, కుమారస్వామి అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

తాళ్లపూడి: ప్రభుత్వం ఇచ్చిన హామీలను, ఇతర సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. తాడిపూడిలో శనివారం ఆయన పర్యటించారు. గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తాను ఈ ప్రాంత సమస్యలు గుర్తించానని, నా దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. జనసేన మండల అధ్యక్షుడు గంటా కృష్ణ, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



తాళ్లపూడిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామకృష్ణ

తాళ్లపూడి: విద్యార్థులు సైబర్ నేరాలపై, మొబైల్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. స్థానిక కరిబండి విద్యాసంస్థల్లోని ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం తాళ్లపూడి ఎస్సై ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మొబైల్ యాప్‌ల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు అనవసర లింక్‌లను పంపి బ్యాంక్ ఖాతాల్లోని నగదు కాజేయడం, తరువాత బ్లాక్ మెయిల్ చేస్తారన్నారు. అంతే కాకుండా కొన్ని ఉద్యోగ ప్రకటనలపై కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో కళాశాల డైరెక్టర్ కరిబండి త్రినాథస్వామి, ప్రిన్సిపాల్ పి.మురళి, వైస్ ప్రిన్సిపాల్ డి.మాధవరావు, కళాశాల అధ్యాపకులు పాపారావు, రాజేష్, గిరి, సత్యనారాయణ, అమరేంద్ర, రాఘవేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాసేవే లక్ష్యంగా అందరం కలిసి పనిచేద్దాం

- మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే మద్దిపాటి
- పారిశుధ్యంపై దృష్టి సారించాలి : ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి: ప్రజాసేవే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులందరం కలిసి పనిచేద్దామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శనివారం సాయంత్రం ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికార యంత్రాగాన్ని ప్రక్షాళన చేయకపోతే పనులు జరగడం కష్టంగా ఉందన్నారు. అభివృద్ధి జరగడంలేదని, ప్రభుత్వ బడుల్లో ప్రమాణాలు పడిపోతున్నాయని, శానిటేషన్, రోడ్లు అధ్వనంగా ఉన్నాయని, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రజలకు సక్రమంగా వైద్యం అందడంలేదన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. దేవరపల్లి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని ఆయన అన్నారు. గౌరీపట్నంలో పొల్యూషన్ లేని పరిశ్రమలను తీసుకురావడానికి కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ గ్రామాల్లో టైఫాయిడ్, మలేరియా, వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని, శానిటేషన్ సరిగాలేదని, దీనిపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. విద్యుత్, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రతి పంచాయతీకి 15 ఆర్థిక సంఘం నిధులు విడుదలైనందున డ్రైనేజీల అభివృద్ధి, మంచినీటి సరఫరా, శానిటేషన్ పనులకు వినియోగించాలని ఎమ్మెల్యే వెంకట్రాజు అధికారులను ఆదేశించారు. అనంతరం సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఎంపీడీఓ పి.ప్రభాకరరావు, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

తాళం విరగ్గొట్టి.. ఆమ్లెట్ వేసుకుని..



అంగన్‌వాడీ కేంద్రంలో కోడి గుడ్లతో ఆమ్లెట్ వేసుకున్న దృశ్యం

నిడదవోలు: నిడదవోలు పట్టణంలో చర్చిపేటలో శుక్రవారం రాత్రి రెండు అంగన్‌వాడీ కేంద్రాలలో చోరీ జరిగింది. చర్చిపేటలో 108, 109 అంగన్‌వాడీ కేంద్రాల తాళం బద్దలు కొట్టి లోపలకు ప్రవేశించారు. అక్కడ ఉన్న కోడి గుడ్లతో ఆమ్లెట్లు వేసుకుని తిన్నారు. కొన్ని కోడి గడ్లను పట్టుకుపోయారు. అక్కడ నుండి 120వ అంగన్‌వాడీ కేంద్రానికి వేసిన తాళం బద్దలు కొట్టడానికి ప్రయత్నించారు. తాళం రాకపోవడంతో వెనుతిరిగారు. ఇదీ మద్యం మత్తులో ఆకతాయి యువత చేసిన పనిగా పోలీసులు గుర్తించారు. అంగన్‌వాడీ పట్టణ సూపర్‌వైజర్ సీహెచ్ లక్ష్మి అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని కూలిన విద్యుత్ స్తంభం



కొవ్వూరులో కూలిన విద్యుత్ స్తంభం

కొవ్వూరు: పట్టణంలో పాత రైలు వంతెన వద్ద కాటన్ విగ్రహం జంక్షన్ సమీపంలో నాలుగు రోజుల క్రితం ఓ లారీ ఢీకొనడంతో సెంట్రల్ లైటింగ్ విద్యుత్ స్తంభం కూలిపోయింది. ఆ రోజు మధ్యాహ్నం వరకూ లారీ అక్కడ ఉండిపోయింది. తర్వాత దానిని తీసివేశారు. కానీ ఇప్పటికీ విద్యుత్ స్తంభం అలాగే ఉంది. దానిని పట్టించుకునే వారే కరువయ్యారు. స్థానికులు గుర్తించి మున్సిపల్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అయినా పట్టించుకోలేదు.

మహిళ మెడలో గొలుసు చోరీ

చాగల్లు: గుర్తు తెలియని వ్యక్తులు మహిళ మెడలో గొలుసు చోరీ చేసిన సంఘటన శనివారం మండలంలోని నేలటూరు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొవ్వూరు మండలం పసివేదల గ్రామానికి చెందిన గారపాటి సంపూర్ణ ప్రభావతి శనివారం సాయంత్రం వాకింగ్ చేస్తూ నేలటూరు వైపు వెళుతున్నారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలో ఉన్న సుమారు ఆరు కాసుల బంగారు తాడును లాక్కుని ఆమెను పక్కకు నెట్టేసి వెళ్లి పోయారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు చాగల్లు ఎస్ఐ కె.నరేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

27న కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఈనెల 27వ తేదీన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్ పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులందరూ విధిగా హాజరు కావాలని కోరారు. పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై సమీక్షించనున్నట్లు ఆమె తెలిపారు.

అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెరవలి: అన్నవరప్పాడులో హరిహర క్షేత్రంగా పేరుగాంచిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం శనివారం కావడంతో భక్తులు తెల్లవారు జాము నుంచే స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు మొదలైన భక్తుల తాకిడి ఒంటి గంట వరకూ కొనసాగింది. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అంతే కాకుండా భక్తుల నుంచి అన్నదానం కోసం విరాళాలు సేకరిస్తున్నామని వివరించారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ




తనిఖీ నిర్వహిస్తున్న జేసీ చిన్న రాముడు

చాగల్లు: ఖరీఫ్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే ప్రక్రియలో మౌలిక సదుపాయాలు, రికార్డుల నిర్వహణ కోసం పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. శనివారం నెల్లటూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని పౌర సరఫరాలు మార్కెటింగ్, రెవెన్యు అధికారులతో కలిసి తనిఖీ చేశారు. జేసీ మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే ప్రక్రియలో భాగంగా ముందస్తుగా జిల్లాలోని అన్ని ఆర్ఎస్‌కేలలో మౌలిక సదుపాయాలు, అనుబంధ పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ధాన్యం సేకరణకు సంబంధించిన లావాదేవీల రికార్డుల పరిశీలించారు. జేసీ వెంట పౌర సరఫరాల జిల్లా అధికారి టి.రాధిక, ఏడీ మార్కెటింగ్ ఎం.సునీల్ వినయ్, చాగల్లు తహసీల్దార్ ఎం.మేరీకమ్మ, ఆర్ఎస్‌కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

నల్లజర్ల: ప్రజారోగ్య పరిరక్షణ కోసం ప్రజలలో అవగాహన కలిగించేందుకు శనివారం వైద్యబృందం సింగరాజుపాలెం, కొండాయిగుంట గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. తాడేపల్లి గూడెం మలేరియా సబ్‌యూనిట్ అధికారి లక్ష్మణ రావు ఆధ్వర్యంలో వైద్యబృందం పరిసరాల పరిశుభ్రత, ఫీవర్ సర్వే, డ్రైడే కార్యక్రమాలను పరిశీలిస్తూ దోమలద్వారా వచ్చేవ్యాధులపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజలతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామారోగ్యకార్యకర్తలు ఇందిరా ప్రియదర్శిని, ఎంఎల్‌హెచ్‌పీ సాయినాథ్,అంగన్‌వాడీ కార్యకర్త చంద్రదేవి, ఆశ కార్యకర్తలు పి.రత్నకుమారి,డి.ప్రశాంతి, పి.రమణ పాల్గొన్నారు.

పేద విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు రూ.లక్ష విరాళం




కొవ్వూరులో ప్రిన్సిపాల్‌కు చెక్కు అందజేస్తున్న కాశీవిశ్వనాథ్

కొవ్వూరు: పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించేందుకు పట్టణంలో ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో 2000-2003 బీఎస్సీ కంప్యూటర్ చదివిన పూర్వ విద్యార్థి జమ్ముల భువనేశ్వరీ, ఆమె భర్త మద్దిపాటి శ్రీరామ్‌కుమార్ రూ.లక్ష విరాళం అందించినట్టు ప్రిన్సిపాల్ ఎన్‌వీ సుబ్బారావు తెలిపారు. గడచిన 25 ఏళ్ల నుంచి యాజమాన్యం, దాతల సహకారంతో ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ఏటా స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామన్నారు. సింగపూర్‌లో స్థిరపడిన పూర్వ విద్యార్థి భువనేశ్వరి సమకూర్చన ఈ ఆర్థిక సాయం చెక్కును ఆమె తండ్రి జమ్ముల కాశీ విశ్వనాథ్ చేతుల మీదుగా ప్రిన్సిపాల్‌కి అందజేశారు.

నేడు జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సమావేశం

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం మొదటి కార్యవర్గ సమావేశం ఆదివారం ఉదయం 9 గంటలకు దేవరపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరగనుంది. ఈ విషయాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టూరి కాశీ, కోశాధికారి మామిడి వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడు వెలగా శ్రీరామూర్తి అధ్యక్షతన జరగనున్న సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు హాజరవుతున్నట్టు కాశీ తెలిపారు. జిల్లాలోని ఆర్య వైశ్య మహిళా సంఘం, యువజన సంఘం సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గ్రంథాలయంలో ధ్వంసమైన ఫ్లోరింగ్



ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో దెబ్బతిన్న ఫ్లోరింగ్

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో ఫ్లోరింగ్ దెబ్బతినడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. 2008-10లో ఉండ్రాజవరంలో సుమారు రూ.14.30 లక్షలతో శాఖ గ్రంథాలయానికి నూతన భవనం నిర్మించారు. ఆ భవన నిర్మాణంలో ఫ్లోరింగ్‌కు టైల్స్ వేశారు. ఫ్లోర్ ఫిలింగ్ సరిగా చేయకపోవడంతో టైల్స్ పగుళ్లు ఇచ్చి పాడైపోయాయి. ఇక్కడ కూర్చిలు లేకపోవడంతో నిత్యం వచ్చే పాఠకులు కిందే కూర్చుంటున్నారు. ఫ్లోర్ పాడైపోవడంతో కూర్చునేందుకు పాఠకులు అవస్థలు పడుతున్నారు.అధికారులు స్పందించి గ్రంథాలయాన్ని పరిశీలించి ఫ్లోరింగ్ చేయాలని పాఠకులు కోరుతున్నారు.

